సాక్షి ములుగు

శుక్రవారం । 19 । జనవరి । 2024



అప్రమత్తతే 'శ్రీరామ'రక్ష..
సైబర్ నేరగాళ్లు ప్రస్తుతం రామమందిర అంశాన్ని వినియోగించుకుంటున్నారు. నకిలీ క్యూ ఆర్ కోడ్‌లు సృష్టించి సోషల్ మీడియాలో విస్తృత ప్రచారం నిర్వహిస్తున్నారు.
- 8లో▸



క్రీడలతో మానసిక ఉత్తేజం
బొగ్గు ఉత్పత్తే లక్ష్యంగా పని చేస్తున్న కార్మికులకు క్రీడలతో మానసిక ఉత్తేజం కలుగుతుందని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు తెలిపారు.
- 8లో▸

వాతావరణం
గరిష్టం/కనిష్టం
31.0^0/19.0^0
జిల్లాలో ఉదయం ఆహ్లాదకరమైన వాతావరణం ఉంటుంది. మధ్యాహ్నం ఎండ తీవ్రత ఉంటుంది. రాత్రివేళ చలితో పాటు పొగమంచు కురిసే అవకాశం ఉంది.

కల నెరవేరేనా?

16 ఏళ్లుగా కరకట్ట నిర్మాణం కోసం ప్రజల ఎదురుచూపు

- అంచనా, సర్వేలకు పదేళ్లు పట్టింది
- మంత్రి సీతక్క దృష్టి సారించాలని కోరుతున్న స్థానికులు



వరదకోతకు గురై ధ్వంసమైన పుష్కరఘాట్ (ఫైల్)



గోదావరి వరద కోతకు గురవుతున్న సాగు భూములు (ఫైల్)

మంగపేట: తెలంగాణ స్వరాష్ట్రంలో గత ప్రభుత్వ పదేళ్ల పాలనలో కలగా మిగిలిన కరకట్ట నిర్మాణం పనులు నూతనంగా కొలువు దీరిన కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలోనైనా నెరవేరేనా అని స్థానిక ప్రజలు ఆశతో ఎదురుచూస్తున్నారు. మండల పరిధిలోని కమలాపురం నుంచి మంగపేట వరకు గోదావరి ఒడ్డు వెంట 5.5 కిలోమీటర్ల మేర కరకట్ట నిర్మాణం చేపట్టేందుకు 2008లో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో నాటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర రెడ్డి ప్యాకేజీ వర్క్ కింద రూ.5,77,40,450 నాబార్డు నిధులను మంజూరు చేశారు. అట్టి పనుల టెండర్ దక్కించుకున్న రాఘవ కన్‌స్ట్రక్షన్ ప్రైవేట్ కంపెనీ కమలాపురం ఇంటెక్‌వెల్ వద్ద నుంచి సుమారు 3 కిలోమీటర్ల మేర కరకట్ట నిర్మాణం, గౌరారంవాగు బ్రిడ్జి నుంచి సుమారు 500 మీటర్ల వరకు వాగు ఒడ్డు కోతకు గురి కాకుండా ఉండేందుకు రిటైనింగ్‌వాల్ ను పొదుమూరు వరకు నిర్మించారు. కమలాపురం, మంగపేట మధ్యగల దొంగలొర్రె వద్ద నుంచి పొదుమూరు పుష్కరఘాట్ వరకు కరకట్ట లేకపోవడంతో ప్రతిఏటా వర్షాకాలంలో వచ్చే గోదావరి వరదతో ఒడ్డు కోతకు గురవుతూ వస్తోంది. దీంతో విలువైన రైతుల నల్లరేగడి భూములు గోదావరిలో కలిసి పోతున్నాయి. అదే విధంగా గోదావరి ఉప్పొంగి ప్రవహించిన ప్రతీసారి లోతట్టు ప్రాంతాల్లోని పంట పొలాల్లో ఇసుక మేటలు ఏర్పడుతున్నాయి. దీంతో పాటు పొదుమూరులోని జనావాసాలు ముంపునకు గురవుతుండటంతో ప్రజలు వరదలు తగ్గే వరకు పునరావాస కేంద్రాల్లో తల దాచుకోవాల్సిన దుస్థితి నెలకొంటుంది.

హామీలతో సరిపెట్టిన గత ప్రభుత్వం

గడిచిన బీఆర్‌ఎస్ ప్రభుత్వ పదేళ్ల పాలనలో కరకట్ట నిర్మాణ ప్రదేశాన్ని పాలకులు, అధికారులు సందర్శించడంతో పాటు హామీలు, అంచనాలు, నిధుల మంజూరు, భూసర్వేలకు పరిమితమైన విషయం తెలిసిందే. గత ప్రభుత్వ నిర్లక్ష్యం, ఇరిగేషన్ అధికారుల ముందు చూపు లేని కారణంగా 2015 గోదావరి పుష్కరాల సమయంలో రూ 4.22 కోట్లతో నిర్మించిన 170 మీటర్ల పుష్కరఘాట్ కోతకు గురై కొట్టుకు పోయింది. 1,380 మీటర్ల బీటీ రోడ్డు, రూ 14.37 లక్షలతో ఏర్పాటు చేసిన వాటర్ సిస్టర్న్‌లు, పైప్‌లైన్ గోదావరి పాలయ్యాయి. కమలాపురం నుంచి జిల్లా సరిహద్దు ప్రాంతమైన అకినేపల్లి మల్లారం వరకు గోదావరి తీరంవెంట ఉన్న విలువైన వందలాది ఎకరాల నల్లరేగడి భూములు గోదావరిలో కలిసి పోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు.

ముంపు ప్రాంత ప్రజల బాధలు వర్ణనాతీతం

ప్రతిఏటా వర్షాకాలంలో గోదావరి ఉప్పొంగి ప్రవహించడంతో సమీప లోతట్టు గ్రామాల ప్రజల పరిస్థితి అత్యంత దయనీయంగా మారుతోంది. గోదావరి వరదలతో గ్రామాలకు గ్రామాలు నీట మునగడం పరిపాటిగా మారింది. వరదల సమయంలో అధికార యంత్రాంగం ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించడం వరదలు తగ్గే వరకు భోజన వసతి కల్పించడం వారి బాధ్యత కాగా పునరావాస కేంద్రాల సందర్శనకు వచ్చే పాలకులు వచ్చే ఏడాది వరకు కరకట్టలు నిర్మిస్తాం, ముంపు ప్రాంత ప్రజలకు వేరొక చోట ఇంటి స్థలాలు ఇచ్చి ఆదుకుంటామని హామీలు ఇచ్చి 20 కేజీల బియ్యం, నిత్యావసర సరుకులు పంపిణీ చేస్తూ ఫొటోలకు పోజులివ్వడం తప్ప ఇప్పటి వరకు ఒరిగింది ఏమీలేదని ప్రజలు వాపోతున్నారు..

సర్వేతో నిలిచిపోయిన పనులు

మండల కేంద్రంలోని దొంగలొర్రె వద్ద నుంచి పుష్కరఘాట్ వరకు 2.5కిలో మీటర్ల కరకట్ట నిర్మాణానికి ప్రభుత్వం 2022లో రూ.109.79 కోట్లు, భూసేకరణకు రూ.27 కోట్ల నిధులను మంజూరు చేసింది. గోదావరి ఒడ్డు నుంచి సుమారు 30 మీటర్ల వెడల్పుతో రెండున్నర కిలోమీటర్ల దూరం వరకు 50 నుంచి 60 ఎకరాల భూసేకరణ కోసం రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు ఉమ్మడి సర్వే నిర్వహించారు. ఈ క్రమంలో 2022 జూలైలో వచ్చిన వరదలను అరికట్టే విధంగా కరకట్ట నిర్మాణానికి అప్పటి సీఎం కేసీఆర్ ఆదేశాల మేరకు రీడిజైనింగ్ కొరకు సెంట్రల్ డిజైన్ ఆఫీస్‌కు పంపించామని ఇరిగేషన్ అధికారులు చెబుతున్నారు.

కొత్త ప్రభుత్వంపైనే ఆశలు

ఏటూరునాగారం నుంచి మంగపేట మండల వరకు గోదావరి ఒడ్డు వెంట కోతకు గురవుతున్న భూములను, వరద ముంపు ప్రాంతలను ప్రస్తుత పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి, స్త్రీ శిశుసంక్షేమ శాఖ మంత్రి సీతక్క, డిప్యూటీ సీఎం బట్టి విక్రమార్క సందర్శించిన సందర్భాలు ఉన్నాయి. సమస్యపై అప్పటి ఎమ్మెల్యే సీతక్క అసెంబ్లీలో లేవనెత్తి ప్రభుత్వాన్ని నిలదీసినా ఫలితం లేకుండా పోయింది. ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉండడం మండల ప్రజల సమస్యలతో పాటు గోదావరి కరకట్ట నిర్మాణం, లోతట్టు ప్రాంత ప్రజల వరద సమస్యను ప్రత్యక్షంగా చూసిన సీతక్క మంత్రిగా, బట్టి విక్రమార్క డిప్యూటీ సీఎంగా బాధ్యతలు చేపట్టంతో ముఖ్యమంత్రితో చర్చించి కరకట్ట నిర్మాణం పనులను ప్రారంభించే విధంగా ప్రత్యేక దృష్టి సారిస్తారని ప్రజలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

కరకట్ట నిర్మాణం పూర్తవుతుందని ఆశిస్తున్నాం..



మండలంలోని సంగ్రోని ఒర్రె నుంచి పుష్కరఘాట్ వరకు రెండున్నర కిలోమీటర్ల మేర కరకట్ట నిర్మించేందుకు గత ప్రభుత్వం నిధులు మంజూరు చేసినా పనులు ప్రారంభించడంలో నిర్లక్ష్యం చేసింది. కరకట్ట నిర్మాణానికి అసెంబ్లీలో గత ప్రభుత్వంపై ఒత్తిడి చేసిన ఎమ్మెల్యే సీతక్క ప్రస్తుతం అధికార పార్టీలో ఉండి మంత్రిగా బాధ్యతలు చేపట్టడంతో వచ్చే వర్షాకాలం వరకు కరకట్ట నిర్మాణం పనులు పూర్తిచేసే విధంగా స్పందిస్తారని ఆశతో ఉన్నాం. గోదావరి ఒడ్డు వెంట కరకట్ట నిర్మించి సాగు భూములు కోల్పోకుండా రైతులను ఆదుకోవాలి. అదే విధంగా వరద ముంపు ప్రాంత బాధితులకు వేరొక చోట ఇంటి స్థలాలు మంజూరు చేయిచి మంత్రి సీతక్క అండగా నిలుస్తారని ఆశిస్తున్నాం.

- బొల్లె రాములు, రైతు, పొదుమూరు

జిల్లా అభివృద్ధికి కృషి

రాష్ట్ర పంచాయతీ రాజ్, స్త్రీ, శిశు సంక్షేమశాఖ మంత్రి సీతక్క



మంత్రిని సన్మానిస్తున్న పాలకమండలి సభ్యులు

ములుగు: జిల్లాను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానని రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి సీతక్క అన్నారు. జిల్లా కేంద్రంలోని ములుగు గ్రామ పంచాయతీ పాలక మండలి ఆధ్వర్యంలో గురువారం మంత్రి సీతక్కను పాలకవర్గ సభ్యులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సీతక్క మాట్లాడుతూ ములుగు ప్రాంతంలో ప్రతీ కుటుంబంతో తనకు ప్రత్యేక అనుబంధం ఉందన్నారు. ములుగు ప్రాంతాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి ప్రగతి పథంలోకి తీసుకెళ్తానని తెలిపారు. ప్రతీ గ్రామాన్ని అభివృద్ధి చేయడానికి కట్టుబడి ఉన్నానని అందుకు అందరూ సహకరించాలన్నారు. జిల్లా కేంద్రంలో మోడల్ మార్కెట్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని, శిథిలావస్థలో ఉన్న బస్టాండ్‌ను అద్భుత రీతిలో తీర్చి దిద్దుతాం అని హామీనిచ్చారు. అనంతరం కలెక్టర్ ఇలా త్రిపాఠి మాట్లాడుతూ మారుమూల ప్రాంతం నుంచి అంచెలంచెలుగా ఎదిగిన నేతగా మంత్రి సీతక్క ఎంతో మందికి ఆదర్శంగా ఉన్నారన్నారు. క్లిష్ట పరిస్థితుల్లో సైతం నేనున్నానని ఎంతో మందికి అండగా నిలిచారని స్థానిక ఎమ్మెల్యే మంత్రిగా ఉండటం చాలా సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్(స్థానిక సంస్థలు) పి.శ్రీజ, సీఈఓ ప్రసూన రాణి, డీపీవో వెంకయ్య, డీఎల్‌పీవో స్వరూప రాణి, స్థానిక సర్పంచ్ బండారి నిర్మల, ఉప సర్పంచ్ వంగ సుమలత పాల్గొన్నారు.



బీటీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న సీతక్క

బీటీ రోడ్డు పనులను ప్రారంభించిన సీతక్క

ములుగు రూరల్: మండలంలోని శ్రీనగర్ నుంచి ఏసునగర్ వరకు రూ.5 కోట్లతో నిర్మిస్తున్న బీటీ రోడ్డు పనులను గురువారం మంత్రి సీతక్క ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ అభివృద్ధి పనులే ధ్యేయంగా ప్రభుత్వం ముందుకు సాగుతుందని తెలిపారు.

భవన నిర్మాణ పనుల తనిఖీ



భవన నిర్మాణ పనులను పరిశీలిస్తున్న కలెక్టర్

ములుగు: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల సమీపంలో ఐటీడీఏ ఏటూరునాగారం ఆధ్వర్యంలో నిర్మిస్తున్న వికాస భవన నిర్మాణ పనులను కలెక్టర్ ఇలా త్రిపాఠి గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పనులను నాణ్యతగా త్వరితగతిన పూర్తిచేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. వికాస భవనంలో దివ్యాంగ విద్యార్థులకు ఒకే చోట వసతి, విద్య అందిస్తామని తెలిపారు. భవన నిర్మాణానికి ప్రభుత్వం రెండు ఎకరాల స్థలాన్ని కేటాయించిందని తెలిపారు. అదే ఆవరణలో 10 గుంటల స్థలాన్ని పోలీస్ భరోసా కేంద్రానికి కేటాయించాలని సంబంధిత తహసీల్దార్‌ను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి ప్రేమలత, ఐటీడీఏ అధికారులు పాల్గొన్నారు.

సింగిల్ లైన్ అడ్మినిస్ట్రేషన్ అమలు చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న అరుణ్‌కుమార్

ఏటూరునాగారం: ఐటీడీఏ పరిధిలోని శాఖల ద్వారా సింగిల్ లైన్ అడ్మినిస్ట్రేషన్ అమలు చేయాలని తుడుందెబ్బ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ మైపతి అరుణ్‌కుమార్ అన్నారు. మండల కేంద్రంలోని ఐటీడీఏ కార్యాలయం ఆవరణలో గల కొమురం భీం విగ్రహం ఎదుట గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జీఓ నంబర్ 57 ప్రకారం 1976 ఐటీడీఏను ఏర్పాటు చేశారని, 5వ షెడ్యూల్ భూభాగంలో ఐటీడీఏ పీఓ ద్వారా సింగిల్ అడ్మినిస్ట్రేషన్ చేపడితే గిరిజనులందరికీ మేలు జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు కోరగట్ల లక్ష్మణ్‌రావు, కుంజా నారాయణ, ఎట్టి ప్రకాశ్, పొడెం శోభన్, ఇరుప ప్రభాకర్, రాజశేఖర్, జనార్ధన్ తదితరులు పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

మైనారిటీ గురుకులాల్లో ప్రవేశాలు

భూపాలపల్లి అర్బన్: జిల్లాలోని మైనారిటీ గురుకుల పాఠశాల, కళాశాలల్లో ప్రవేశాల దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు ఇన్‌చార్జ్ జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి శైలజ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నెల 18 నుంచి ఫిబ్రవరి 6వ తేదీలోపు ఆన్‌లైన్ దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. గురుకుల పాఠశాలలో 5వ తరగతిలో మైనారిటీ విద్యార్థులకు 60సీట్లు, 10 బీసీ, 5 ఎస్సీ, 3 ఎస్టీ, 2 ఓసీలకు సీట్లు, జూనియర్ కళాశాలలో ఎంపీసీ, బైపీసీలలో 80 సీట్లు భర్తీ చేయనున్నట్లు తెలిపారు. 6, 7, 8 తరగతులల్లో మైనారిటీ విద్యార్థులకు ఖాళీగా ఉన్న సీట్లు భర్తీ చేయనున్నట్లు పేర్కొన్నారు.

31లోపు పనులు పూర్తిచేయాలి

జెడ్పీ సీఈఓ విజయలక్ష్మి



భూపాలపల్లి రూరల్: జిల్లా పరిషత్, మండల పరిషత్, ఎస్‌ఎఫ్‌సీ ద్వారా 15వ ఫైనాన్స్ నిధులతో మంజూరైన పనులను జనవరి 31లోపు పూర్తి చేయాలని జెడ్పీ సీఈఓ విజయలక్ష్మి సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం జెడ్పీ కార్యాలయంలో అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో జెడ్పీ సీఈఓ విజయలక్ష్మి మాట్లాడారు. వివిధ మండలాలలో పనులను పూర్తిచేసి యుటిలైజేషన్ సర్టిఫికెట్ పంపిస్తే తదుపరి నిధులు విడుదల అవుతాయన్నారు. ఈ సమావేశంలో ఈఈ పీఆర్ దిలీప్‌కుమార్, ఈఈ ఆర్‌డబ్ల్యూఎస్ నిర్మల, డిప్యూటీ ఈఈలు, ఏఈలు, ఎంపీడీఓలు పాల్గొన్నారు.

21న టీజేఎస్ రాష్ట్ర సదస్సు



భూపాలపల్లి అర్బన్: రాష్ట్ర విభజన సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ ఈ నెల 21న టీజేఎస్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో నిర్వహించనున్న రాష్ట్ర సదస్సును విజయవంతం చేయాలని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు రత్నం కిరణ్ పిలుపునిచ్చారు. జిల్లాకేంద్రంలోని పార్టీ కార్యాలయంలో గురువారం వాల్‌పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కిరణ్ మాట్లాడుతూ.. తెలంగాణ ప్రాంత అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలను పది సంవత్సరాలుగా ఒక్కటి కూడా అమలు చేయలేదన్నారు. కేంద్ర ప్రభుత్వం చిత్తశుద్ధిని నిరూపించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సదస్సుకు జిల్లాలోని మేధావులు, ప్రజలు అధికసంఖ్యలో తరలిరావాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు గట్టయ్య, జనార్దన్, శ్రీధర్, శ్రీనివాస్, జయశంకర్, లింగన్న పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక



చిట్యాల: మండలంలోని నైన్‌పాక ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థి మామిడి శివమణి రాష్ట్రస్థాయి బాల్‌బ్యాడ్మింటన్ పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఊర్మిళ తెలిపారు. గురువారం ఆమె మాట్లాడుతూ ఉమ్మడి జిల్లాస్థాయిలో జరిగిన స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ 17 సంవత్సరాల విభాగంలో విద్యార్థి ఎంపిక కావడం సంతోషకరమన్నారు. ఈ సందర్భంగా పాఠశాలకు చెందిన వ్యాయామ ఉపాధ్యాయుడు లింగయ్యను అభినందించి, విద్యార్థి శివమణిని శాలువలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు గూట్ల తిరుపతి, తోట్ల ఐలయ్య, నక్క రవి, మోహన్, ఉపాధ్యాయులు ఒదేలు, సీఆర్‌పీ తిరుపతి పాల్గొన్నారు.

ఓసీపీ పనులను అడ్డుకుంటాం..

భూపాలపల్లి అర్బన్: భూపాలపల్లి ఏరియాలోని కేటీకే ఓపెన్‌కాస్ట్ ప్రభావిత శాంతినగర్ కాలనీ సమస్యను సింగరేణి అధికారులు పరిష్కరించకుంటే ఓసీపీ-2లో బొగ్గు ఉత్పత్తి పనులను అడ్డకుంటామని కాలనీవాసులు తెలిపారు. గురువారం భూపాలపల్లి పర్యటనకు వచ్చిన సింగరేణి డైరెక్టర్ ఆపరేషన్ ఎన్‌వీకే శ్రీనివాస్‌ను కాలనీ వాసులు కలిసి సమస్యలతో కూడిన వినతిపత్రం అందజేశారు. ఓపెన్ కాస్టు ప్రాజెక్ట్-2 ఏర్పడిన నాటి నుంచి శాంతినగర్‌కాలనీ వాసులందరం అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు తెలిపారు. బాంబు బ్లాసింగ్‌తో నివాస గృహాలు పగుళ్లు బారుతున్నాయని చెప్పారు. ఈ నెల 21న భూపాలపల్లికి వస్తున్న సింగరేణి చైర్మన్‌ను అడ్డుకుంటామని డైరెక్టర్‌కు తెలిపారు. కాలనీవాసుల సమస్యలను పరిష్కరించే విధంగా ఈ లోపు సింగరేణి యాజమాన్యం స్పష్టమైన హామీ ఇవ్వాలని కోరారు.

'పది'లో మెరుగైన ఫలితాలకే ప్రత్యేక బోధన



మంగపేట: విద్యార్థులతో మాట్లాడుతున్న సుదర్శన్ రెడ్డి

ఏటూరునాగారం: పదో తరగతి పరీక్షల్లో మెరుగైన ఉత్తీర్ణత సాధించడానికి ప్రభుత్వం ఉన్నత పాఠశాలల్లోని 10వ తరగతి విద్యార్థులకు ప్రత్యేక బోధన కార్యక్రమాలను చేపట్టినట్లు జిల్లా విద్యాశాఖ క్వాలిటీ కంట్రోల్ అధికారి బద్దం సుదర్శన్‌రెడ్డి తెలిపారు. ఇందులో భాగంగా గురువారం మండల కేంద్రంలోని జెడ్పీహెచ్‌ఎస్ పాఠశాలను ఆయన తనిఖీ చేశారు. ఉదయం ప్రారంభమవుతున్న పదో తరగతి బోధన ఏ విధంగా ఉందని పరిశీలించారు. పిల్లలకు అర్థమయ్యే రీతిలో బోధించాలని ఉపాధ్యాయులకు సూచించారు. పరీక్షల సమయంలో ఎలాంటి ఒత్తిడికి లోనుకావద్దని సమయస్ఫూర్తితో పరీక్షలు విజయవంతంగా రాయాలని విద్యార్థులకు సూచించారు. అర్థకాని విషయాలపై ఉపాధ్యాయులను అడిగి అనుమానాలు నివృత్తి చేసుకోవాలన్నారు.

ప్రత్యేక తరగతులు నిర్వహించాలి

వెంకటాపురం(కె): పదో తరగతి విద్యార్థులకు ఉదయం, సాయంత్రం ప్రత్యేక బోధన తరగతులను నిర్వహించాలని జిల్లా విద్యాశాఖ క్వాలిటీ కంట్రోల్ అధికారి బద్దం సుదర్శన్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని నాయకుల గూడెం, రంగరాజాపురం, వెంకటాపురం, నూగూరు, ఒంటిమామిడి పాఠశాలల్లో తొలిమెట్టు కార్యక్రమం అమలు తీరును ఆయన గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులు రోజువారీగా విద్యార్థులకు స్లిప్‌టెస్టులు నిర్వహించాలన్నారు. అభ్యసన దీపికలో ఇచ్చిన ప్రశ్నలకు విద్యార్థుల చేత సమాధానాలు రాయించి విద్యార్థుల అనుమానాలను నివృత్తి చేయాలని సూచించారు. ఉన్నతి కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు నెలవారి పరీక్షలు నిర్వహించి ఫలితాలను నమోదు చేయాలన్నారు. తొలిమెట్టు కార్యక్రమం అమలులో భాగంగా పాఠ్య ప్రణాళిక ప్రకారం బోధన చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీనివాస్, సుజాత పాల్గొన్నారు.

వీఓఏల సమస్యలు పరిష్కరించాలి



డైరీ ఆవిష్కరిస్తున్న నాయకులు

వెంకటాపురం(కె): వీఓఏల సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నరాటి ప్రసాద్ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో వీఓఏ ల సమావేశం గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆయన హాజరై మాట్లాడారు. సెర్ప్ పరిధిలో పనిచేస్తున్న వీవోఏల సమస్యల పరిష్కారానికి ఉద్యమాలు చేయాలన్నారు. వీఓఏలకు అతి తక్కువ వేతనాలు ఇస్తూ ప్రభుత్వం వెట్టి చాకిరీ చేయించుకుంటుందన్నారు. కనీస వేతనం రూ.26 వేలు చెల్లించడంతో పాటు 10లక్షల ఇన్సూరెన్స్‌తో పాటు హెల్త్ కార్డులు ఇవ్వాలని కోరారు. అనంతరం ఏఐటీయూసీ డైరీలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా గౌరవ అధ్యక్షులు తోట మల్లిఖార్జునరావు, నాయకులు వేల్పూల మల్లికార్జునరావు, కట్ల రాజు, కృష్ణ కుమారి, మీనాకుమారి, సమ్మక్క, అనుమల సాయి తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ అంతరాయం లేకుండా ఏర్పాట్లు

ఎస్పీ శబరీష్



ఆర్టీసీ చీఫ్ ఆపరేటింగ్ అధికారి రవీందర్‌తో మాట్లాడుతున్న ఎస్పీ శబరీష్

ములుగు: మేడారం మహాజాతర సమయంలో పలు ప్రాంతాల నుంచి వచ్చే భక్తుల వాహనాలకు ట్రాఫిక్ అంతరాయం లేకుండా పోలీసు శాఖ తరఫున అన్ని రకాల ఏర్పాట్లు చేస్తున్నట్లు ఎస్పీ డాక్టర్ శబరీష్ తెలిపారు. ఈ మేరకు ట్రాఫిక్ మ్యాప్‌ను పరిశీలించడానికి ములుగు మండలం గట్టమ్మ ఆలయానికి గురువారం వచ్చి ఆర్టీసీ చీఫ్ ఆపరేటింగ్ అధికారి రవీందర్‌కు ఎస్పీ పరిస్థితిని వివరించారు. వరంగల్ నుంచి మేడారం వరకు ఎక్కడా వాహనాలు నిలవకుండా తగిన చర్యలు తీసుకుంటున్నట్లు ఎస్పీ తెలిపారు. మేడారం మహాజాతరకు వచ్చే భక్తులు తొలి మొక్కులు గట్టమ్మ తల్లికి చెల్లించే సమయంలో వాహనాలు భారీగా నిలిచిపోకుండా చూస్తామని, ఎప్పటికప్పుడు ట్రాఫిక్ క్లియర్ చేయడానికి సిద్ధంగా ఉన్నామని తెలిపారు. అన్ని రకాల వాహనాలను ఒక క్రమ పద్ధతిలో వెళ్లేలా ప్రణాళిక రూపొందించామన్నారు. భద్రత విషయంలో భక్తులు ఎలాంటి ఇబ్బందులు పడాల్సిన అవసరం లేదన్నారు. వాహనాల రద్దీని మళ్లించే విషయంలో అనుభవజ్ఞులైన పోలీసు అధికారుల సూచనలు తీసుకుంటూ ముందుకు సాగుతున్నామన్నారు. అనుకోకుండా ఎక్కడైనా వాహనాలు మరమ్మతులకు గురైతే క్రేన్ల సాయంతో క్లియర్ చేస్తామని వెల్లడించారు. డైవర్షన్ పాయింట్లలో రేడియం స్టిక్కర్లతో సూచిక బోర్డులను ఏర్పాటు చేస్తున్నామని వివరించారు. గట్టమ్మ చుట్టుపక్కల ట్రాఫిక్ అంతరాయం లేకుండా దుకాణాలను తొలగిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్టీఓ సత్యపాల్‌రెడ్డి, డీఎస్పీ రవీందర్, ఎస్సై వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

బాలల భవిష్యత్ కోసమే
ఆపరేషన్ స్మైల్

భూపాలపల్లి: వెట్టిచాకిరి నుంచి విముక్తి కలిగించి బాలలకు బంగారు భవిష్యత్ అందించాలనే లక్ష్యంతో జిల్లాలో ఆపరేషన్ స్మైల్-10 కార్యక్రమం నిర్వహిస్తున్నామని ఎస్పీ కిరణ్‌ఖరే గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బాల కార్మికులుగా ఇళ్లలో, ఇతర ప్రాంతాల్లో వెట్టిచాకిరి చేస్తున్న పిల్లలకు విముక్తి కల్పించేందుకు ఆపరేషన్ స్మైల్-10 కార్యక్రమం ఈ నెల 1నుంచి ప్రారంభించామని తెలిపారు. చిన్నారులను పనికి పెట్టుకున్న యాజమాన్యాల నుంచి రక్షించి వారి తల్లిదండ్రులకు అప్పగించడం లేదా చదువుపై ఆసక్తి ఉన్న పిల్లలకు చదువు నేర్పించేందుకు ఇతర శాఖల అధికారుల సహకారంతో చర్యలు తీసుకుంటున్నామన్నారు. అనాథ బాలలను గుర్తించి ప్రభుత్వం ఏర్పాటు చేసిన ప్రత్యేక శిబిరాలకు తరలిస్తున్నట్లు చెప్పారు. జనవరి 1నుంచి 31వరకు జిల్లాలో నెల రోజులపాటు ఆపరేషన్ స్మైల్ నిర్వహిస్తున్నామని తెలిపారు. ఇప్పటివరకు 23మంది బాధిత బాలలను రక్షించినట్లు తెలిపారు. పనుల నుంచి విముక్తి కలిగించేందుకు 1098 లేదా 100 ఫోన్‌నంబర్లకు సమాచారం అందించాలని కోరారు. బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమన్నారు. 18 ఏళ్లలోపు పిల్లలతో పని చేయించొద్దన్నారు. పనిలో పెట్టుకుంటే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

డైరెక్టర్ పదవి కన్నెపల్లివాసులకే ఇవ్వాలి



సీతక్కకు వినతి పత్రం ఇస్తున్న యూత్ నాయకులు

ఎస్‌ఎస్ తాడ్వాయి: మేడారం సమ్మక్క- సారలమ్మ జాతర కమిటీలో డైరెక్టర్ పదవి కన్నెపల్లి గ్రామానికి చెందిన ఆదివాసీలకే ఇవ్వాలని సారలమ్మ యూత్ అధ్యక్షులు మనోజ్‌కుమార్, నాగరాజులు జిల్లా కేంద్రంలో మంత్రి సీతక్కను కలిసి గురువారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కన్నెపల్లిలో సారలమ్మ కొలువుదీరిన గ్రామానికి ఇప్పటి వరకు జాతర కమిటీలో డైరెక్టర్ పదవి ఇవ్వలేదన్నారు. అలాగే మేడారం జాతర చైర్మన్ పదవీ మేడారం, ఊరట్టం, కన్నెపల్లి గ్రామాల్లోని స్థానిక ఆదివాసీలకే ఇవ్వాలని కోరారు. జాతర అభివృద్ధి పనులను స్థానిక ఆదివాసీలకు కేటాయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీతక్క యువసేన జిల్లా అధ్యక్షుడు చేర్ప రవీందర్, సారలమ్మ యూత్ నాయకులు శివకుమార్, శోభన్, మధు, తదితరులు పాల్గొన్నారు.

మేడారంలో ప్లాస్టిక్ నిషేధించాలని నోటీసులు



వ్యాపారులకు నోటీసులు అందజేస్తున్న సిబ్బంది

ఎస్‌ఎస్ తాడ్వాయి: మేడారం జాతర సందర్భంగా సంపూర్ణ ప్లాస్టిక్ నిషేధం పాటించి ప్లాస్టిక్ ఫ్రీ జాతరగా మార్చాలని మేడారం గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో గురువారం స్థానిక వ్యాపారులకు నోటీసులు జారీ చేశారు. వచ్చే నెల 21 నుంచి 24వ తేదీ వరకు జాతర జరగనున్న నేపథ్యంలో మేడారం జాతరలో ప్లాస్టిక్‌ను పూర్తిగా నిషేధించాలని అధికారులు సిద్ధమయ్యారు. ప్లాస్టిక్‌తో వాతావరణం కలుషితం కాకుండా మేడారం చుట్టుపక్క గ్రామాల ప్రజలతో పాటు జాతరకు వచ్చే భక్తులు కూడా ప్లాస్టిక్ నిషేధం పాటించాలని కోరారు. ఇందులో భాగంగా గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో మేడారంలోని స్థానిక దుకాణాల్లో ప్లాస్టిక్‌ను అరికట్టేందుకు వ్యాపారులకు నోటీసులు జారీ చేసినట్లు గ్రామ పంచాయతీ అధికారులు తెలిపారు.

క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

గూడూరు: రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన మండలంలోని అయోధ్యపురం- వాయిల్‌బంధం దారిలో జరిగింది. ఎస్సై రాణాప్రతాప్ కథనం ప్రకారం మండలంలోని నాయక్‌పల్లికి చెందిన బుర్రి ఉప్పలయ్య (56) బుధవారం మండలంలోని గుండెంగలో జరిగిన ఓ వివాహ వేడుకకు హాజరయ్యాడు. అనంతరం రాత్రి ద్విచక్రవాహనంపై నాయక్‌పల్లికి వస్తున్న క్రమంలో అయోధ్యపురం- వాయిల్‌బంధం దారిలో వాహనం అదుపు తప్పి కిందపడ్డాడు. తలకు తీవ్ర గాయమై అక్కడిక్కడే మృతిచెందాడు. గురువారం తెల్లవారుజామున ఆ దారి వెంట వస్తున్న వారు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు చేరుకుని మృతుడి వివరాలు సేకరించారు. ఉప్పలయ్యకు భార్య, ముగ్గురు కూతుళ్లు, కొడుకు రాజు ఉన్నాడు. రాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

ఆన్‌లైన్ గేమ్‌లో రూ.10 లక్షలు పోగొట్టుకున్న రైల్వే ఉద్యోగి

కాజీపేట: ఆన్‌లైన్ గేమ్‌కు ఆకర్షితుడైన ఓ రైల్వే ఉద్యోగి.. సైబర్ నేరగాళ్ల చేతికి చిక్కి రూ.10 లక్షలు పోగొట్టుకున్నారు. కాజీపేట పట్టణంలోని రైల్వే ఎలక్ట్రికల్ షెడ్‌లో టెక్నీషియన్‌గా పనిచేసే రాజస్థాన్‌కు చెందిన లోకేష్ ఖాళీ సమయంలో తరుచూ సెల్‌ఫోన్‌లో ఆన్‌లైన్ గేమ్ ఆడుతాడు. సైబర్ నేరగాళ్లు మొదట రూ.5 లక్షల వరకు డబ్బులు గెల్చుకునేలా నమ్మించారు. దీంతో ఈ ఆట సులువుగా ఉందని, ఇలాగే కొనసాగితే మరిన్ని లక్షలు రావడం ఖాయమని నమ్మిన లోకేష్.. ఆట కొనసాగించాడు. మొదట నమ్మించి ముగ్గులోకి దింపిన సైబర్ నేరగాళ్లు.. లోకేష్ బ్యాంకు ఖాతాలో ఉన్న రూ. 10 లక్షలు, గెల్చుకున్న రూ.5 లక్షలు కాజేసి ఆన్‌లైన్ నుంచి మాయమయ్యారు. బ్యాంకు ఖాతా నుంచి డబ్బులు పూర్తిగా పోయినట్లు ఆలస్యంగా గుర్తించిన లోకేష్ లబోదిబోమంటూ 1930కు ఆన్‌లైన్‌లో ఫిర్యాదు చేశారు. అనంతరం స్నేహితుల సూచన మేరకు గురువారం కాజీపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు.

అప్రమత్తతే 'శ్రీరామ'రక్ష..

రాముడినీ వదలని సైబర్ నేరగాళ్లు

- అయోధ్య రామమందిరానికి విరాళాలంటూ నకిలీ క్యూఆర్ కోడ్‌లు
- శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్టు పేరుతోనూ ఫేక్ వెబ్‌సైట్లు
- ఆలయ ప్రాణప్రతిష్ఠను పురస్కరించుకుని మొబైల్ రీచార్జ్‌లో భారీ రాయితీలు
- వివిధ రూపాల్లో భక్తుల నుంచి క్యాష్ చేసుకుంటున్న మోసగాళ్లు..
- అనుమానాస్పద లింక్‌లు, క్యూఆర్ కోడ్‌ల జోలికి వెళ్లొద్దంటున్న పోలీసులు



సాక్షి, వరంగల్: సైబర్ నేరగాళ్ల మోసాలకు అంతే ఉండడం లేదు. బ్యాంక్ అకౌంట్ నంబర్, ఆధార్ అప్‌డేట్ చేసుకోవాలని, ఆన్‌లైన్‌లో ఉద్యోగాల పేరిట సెల్‌ఫోన్లకు లింక్‌లు పంపుతున్నారు. ఈ విషయం తెలియని అమాయకులు వాటిని ఓపెన్ చేస్తున్నారు. దీంతో క్షణాల్లో తమ బ్యాంకు ఖాతాల నుంచి నగదు మాయం అవుతోంది. అయితే తరహా మోసాలపై అధికారులు ప్రజలకు అవగాహన కల్పించడంతో కొంతమేర మార్పువచ్చింది. దీంతో సైబర్ నేరగాళ్లు తమ పంథా మార్చారు. ప్రస్తుతం రామమందిర అంశాన్ని వినియోగించుకుంటున్నారు. అయోధ్యలో రామమందిర ప్రారంభోత్సవం కోసం వేయికండ్లతో వేచి చూస్తున్న భక్తులకు శఠగోపం పెట్టే కార్యక్రమానికి సైబర్ నేరగాళ్లు తెరలేపారు. ఆలయ నిర్మాణానికి విరాళాలు కావాలంటూ కొందరు.. అక్కడికి వచ్చే భక్తులకు ప్రసాదం పంపిణీకి విరాళాలు కావాలంటూ ఇంకొందరు నకిలీ క్యూ ఆర్ కోడ్‌లు సృష్టించి సోషల్ మీడియాలో విస్తృత ప్రచారం నిర్వహిస్తున్నారు. దీంతో కొందరు భక్తులు ఇది నిజమని నమ్ముతున్న ఘటనలు చోటుచేసుకుంటున్నాయి. అలాగే, అయోధ్యలోని రామజన్మభూమి ఆలయ ప్రాణప్రతిష్ఠను పురస్కరించుకుని మొబైల్ రీచార్జ్‌లో భారీ రాయితీలు ఉన్నాయంటూ సెల్‌ఫోన్లకు వాట్సాప్ ద్వారా పంపుతున్న ఘటనలు చోటుచేసుకుంటున్నాయి. ఏదేమైనా భక్తిని క్యాష్ చేసుకునేందుకు సైబర్ నేరగాళ్లు ఈ కొత్త తరహా నేరాలకు తెరలేపిన నేపథ్యంలో భక్తులు జాగ్రత్తగా ఉండాలని వరంగల్ కమిషనరేట్ పోలీసులు సూచిస్తున్నారు. కొన్ని రోజులు ఫోన్లు, వాట్సాప్‌ల్లో సందేశాలు వస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని సైబర్ క్రైమ్ పోలీసులు హెచ్చరిస్తున్నారు.

నకిలీ వెబ్ సైట్లు సైతం సృష్టించి...

అయోధ్యలోని రామజన్మభూమి ఆలయ ప్రాణప్రతిష్ఠ ఈ నెల 22న జరగనుంది. కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు అయోధ్యలో బాలరాముడి వద్ద పూజించిన అక్షింతల వితరణ కార్యక్రమం కొనసాగింది. ఒకటి నుంచి 15 వరకు ఇంటింటికీ తిరిగి అక్షింతలు అందజేశారు. శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్టు ఆధ్వర్యంలో ఇది జరగడంతో పాటు ప్రధాని మోదీ అయోధ్యను సందర్శించడం, ఈ నెల 22న అంగరంగ వైభవంగా జరుగుతుందని విస్తృత ప్రచారం రావడంతో మరికొందరు సైబర్ నేరగాళ్లు మిగతా ఆలయ పనులు త్వరగా పూర్తయ్యేందుకు విరాళాలు అవసరమని నకిలీ వెబ్ సైట్లు సైతం సృష్టించారు. ఆలయ నిర్మాణానికి తమకు తోచిన సాయం చేయాలని భక్తులు ఆన్‌లైన్‌లో వెబ్‌సైట్ల కోసం వెతుకుతుండడాన్ని దృష్టిలో ఉంచుకుని 'శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్టు' పేరుతో నకిలీ వెబ్ సైట్లు రూపొందించారు. వీటిని సామాజిక మాధ్యమాల్లో షేర్ చేస్తున్నారు. దీనిపై ప్రజలు అప్రమత్తంగా ఉండి ఈ నకిలీ సైట్లతో పాటు సైబర్ నేరగాళ్లు పంపించే లింక్‌లను తెరవొద్దని వరంగల్ పోలీసు కమిషనర్ అంబర్ కిశోర్ ఝూ తెలిపారు. ఈ లింక్‌ల వల్ల ఖాతాల్లోని డబ్బులు కొల్లగొట్టడంతో పాటు ఆయా మొబైల్ ఫోన్‌లలో ఉన్న వ్యక్తిగత సమాచారం కూడా తస్కరణకు గురయ్యే అవకాశముందని, ఆ సెల్ ఫోన్‌కు కూడా ప్రమాదకరమని హెచ్చరించారు. ఎక్కడైనా ఎవరైనా మోసపోతే పోలీసులకు వెంటనే సమాచారం అందించాలని సూచించారు.

నకిలీ యూపీఐ ఐడీలు ఇలా..

ఇప్పటికే శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్టు.. విరాళాల కోసం శ్రీరామ్ జన్మభూమి పేరుతో ఎస్‌బీఐ వివరాలతో కూడిన యూపీఐ ఐడీ అధికారిక వెబ్ సైట్‌లో అందుబాటులో ఉంచింది. దీనికి దగ్గరి పోలికలతోనే కొంతమంది నకిలీ యూపీఐ ఐడీలను అదే ఎస్‌బీఐ ఖాతాలో ఓపెన్ చేసి వాట్సాప్‌ల్లో విరాళాలు ఇవ్వాలంటూ పంపుతున్నారు. ఇలా shriramjanambhomi@sbi, sriramjanambhoomi@sbi, shriramjanambhumi@sbi, sriramjanmbhoomi@sbi, sriramjanmbhumi@sbi... నకిలీ యూపీఐ ఐడీలు సృష్టించారని ఇప్పటికే అన్సుల్ అనే వ్యక్తి ట్విటర్ వేదికగా ఎస్‌బీఐకి ఫిర్యాదు చేశారు. ఈ ఐడీలు ప్రైవేట్ వ్యక్తులు పేరు మీద ఉన్నాయని తెలిపారు.

ప్రజల్లోకి బాలవికాస పథకాలు..



మాట్లాడుతున్న మంత్రి సీతక్క

- రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క
- బాలవికాస ప్రాంగణంలో నీటి శుద్ధికరణ మహాసభలు ప్రారంభం

కాజీపేట రూరల్: సమాజంలో బాలవికాస స్వచ్ఛంద సంస్థ చేపడుతున్న పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు ప్రభుత్వ పరంగా కృషి చేస్తామని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క అన్నారు. కాజీపేట ఫాతిమానగర్‌లోని బాలవికాస ప్రాంగణంలో గురువారం ప్రారంభమైన నీటి శుద్ధికరణ పథకాల సుస్థిరతలో 'గ్రామ పంచాయతీ-కమిటీల పాత్ర' అనే అంశంపై 1500 వాటర్ ప్లాంట్ల కమిటీ సభ్యులతో నిర్వహించిన మహాసభలో మంత్రి సీతక్క ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. రాష్ట్రంలో ఏ నూతన కార్యక్రమం చేపట్టినా అది బాలవికాస నుంచే మొదలవుతుందన్నారు. మహిళా పథకాలు, లీడర్ షిప్ క్వాలిటీ, చెరువు పూడికతీత, అనాథ పిల్లలు, మరుగుదొడ్ల నిర్మాణం, తదితర కార్యక్రమాలు ఎన్నో ఉన్నాయన్నారు. నూతన పథకాలకు కేరాఫ్.. ప్రభుత్వాలకు దీటుగా బాలవికాస సేవలు ఆదర్శనీయమన్నారు. వితంతు విముక్తి ఉద్యమం ద్వారా మూఢనమ్మకాలను పారద్రోలడంలో బాలవికాస చేస్తున్న అభినందనీయమన్నారు. బాలవికాస ఫౌండర్, సభాధ్యక్షురాలు బాలతెరిసా మాట్లాడుతూ 47 ఏళ్ల నుంచి కెనడా సోఫార్ సంస్థ అనుబంధంతో బాలవికాస సంస్థ ప్రజలకు సేవలు అందిస్తూ ఆరోగ్యకర సమాజం కోసం కృషి చేస్తున్నట్లు తెలిపారు. బాలవికాస సేవలు రైతుల నుంచి నిరుద్యోగుల వరకు అండగా ఉంటాయన్నారు. బాలవికాస ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సింగారెడ్డి శౌరిరెడ్డి మాట్లాడుతూ వివిధ రాష్ట్రాలలో విస్తరించిన నీటి శుద్ధీకరణ కమిటీలు నిత్యం వాటర్ ప్లాంట్లను పర్యవేక్షించాలన్నారు. ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ కెమికల్ టెక్నాలజీ చీఫ్ ఇంజనీర్ శ్రీధర్, తెలంగాణ రాష్ట్ర పునరుద్ధరణీయ ఇంధన వనరుల అభివృద్ధి సంస్థ వరంగల్ మేనేజర్ మహేందర్‌రెడ్డి, బాలవికాస ఫెడరేషన్ డైరెక్టర్ కేదం లింగమూర్తి మాట్లాడారు. కాగా, ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, కర్ణాటక, తమిళనాడు, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల నుంచి వాటర్ ప్లాంట్ల అధ్యక్ష, కమిటీ మెంబర్లు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. కార్యక్రమంలో సోఫార్ కెనడా ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ శోభ, బాలవికాస అధ్యక్షుడు నోముల ఇంద్రారెడ్డి, ఉపాధ్యక్షుడు బాసాని మర్రెడ్డి, జనవికాస అధ్యక్షుడు లూర్దు మర్రెడ్డి, రైతు వికాస అధ్యక్షుడు కూసం రాజమౌళి, పీడీటీసీ డైరెక్టర్ సునీతారెడ్డి, సీనియర్ మేనేజర్లు ప్రతాప్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, లత, మంజుల, ఫ్రాన్సిస్‌రెడ్డి, తిరుపతి, శోభ, శివరాం, మొగిలి, విజేందర్, మోసిస్, జాన్‌పాల్, బాల్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ

- రూ. 7లక్షల నగదు అపహరణ
- నర్సంపేటలో ఘటన



స్థానికుల నుంచి వివరాలు సేకరిస్తున్న సీఐ రవి కుమార్

నర్సంపేట రూరల్ : తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ జరిగింది. ఈ ఘటనలో దుండగులు రూ. 7లక్షలు అపహరించారు. పోలీసుల కథనం ప్రకారం హనుమకొండకు చెందిన మొల్గూరి నాగేందర్ కొంతకాలంగా నర్సంపేట పట్టణం సర్వాపురం శివారులోని సాయి నగర్‌లో ఓ ఇంట్లో అద్దెకు ఉంటున్నారు. నాగేందర్ జాతరల్లో జాయింట్ వీల్స్ నడిపిస్తుంటాడు. ఈ క్రమంలో రెండురోజుల క్రితం కుటుంబ సమేతంగా హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలంలోని కొత్తకొండ జాతరకు వెళ్లాడు. గురువారం తెల్లవారుజామున ఇంటికి వచ్చాడు. ఇంట్లోకి వెళ్లే సరికి వెనుక గది తాళం పగలగొట్టి ఉంది. గదిలోని వస్తువులనీ చిందరవందరగా ఉన్నాయి. దీంతో అనుమానం వచ్చి చూడగా ఇంట్లో భద్రపరిచిన రూ.7లక్షలు కనిపించలేదు. దీంతో చోరీ జరిగిందని గ్రహించిన వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. నర్సంపేట టౌన్ సీఐ సుంకరి రవికుమార్, ఎస్సై రవి ఘటనా స్థలికి చేరుకొని చోరీ జరిగిన తీరును పరిశీలించారు. అనంతరం డాగ్‌స్క్వాడ్, క్లూస్ టీమ్‌తో ఆధారాలు సేకరించారు. దీనిపై ఎస్సై రవి వివరణ కోరగా నాగేందర్ ఇంట్లో చోరీ జరిగింది వాస్తవమేనని, రూ. 7లక్షలు అపహరణకు గురయ్యాయన్నారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించాలి





బాలుర విభాగంలో గెలుపొందిన వరంగల్ జట్టుకు బహుమతి అందజేస్తున్న ఎమ్మెల్యే రాజేశ్వర్‌రెడ్డి , బహుమతి అందుకుంటున్న వరంగల్ బాలికల జట్టు

క్రీడల అభివృద్ధికి సహకారం

- జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి
- ముగిసిన అండర్-14 రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి



కబడ్డీ ఆడుతున్న ఎమ్మెల్యే పల్లా

జనగామ: గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించాలని జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని ధర్మకంచ ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో అండర్-14 బాలుర, బాలికల విభాగంలో నిర్వహించిన 67వ రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలు గురువారం ముగిశాయి. జిల్లా విద్యాశాఖ అధికారి రామ్ అధ్యక్షతన జరిగిన ఈ ముగింపు పోటీలకు ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలన్నారు. క్రీడల అభివృద్ధికి తనవంతు సహకారం అందిస్తానన్నారు. పాఠశాల చుట్టూ ఫెన్సింగ్ నిర్మాణం కోసం స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి పరిశీలించిన అనంతరం పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం అధికారులు, ఉపాధ్యాయులు.. ఎమ్మెల్యేను సన్మానించి జ్ఞాపిక అందించారు. కాగా, దేశ సంస్కృతి, సంప్రదాయాల ప్రాధాన్యం తెలుపుతూ నృత్య ప్రదర్శన చేసిన చిన్నారిని ఎమ్మెల్యే అభినందించారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు.

కబడ్డీ ఆడిన ఎమ్మెల్యే ..

నిత్యం రాజకీయ కార్యకలాపాలతో బిజీగా గడిపే ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి అండర్-14 కబడ్డీ రాష్ట్ర స్థాయి ముగింపు పోటీల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కబడ్డీ ఆడి క్రీడాకారుల్లో ఉత్సాహం నింపారు.

గెలుపొందిన జట్లు ఇవే..

రాష్ట్ర స్థాయిలో నిర్వహించిన కబడ్డీ పోటీల్లో వరంగల్, నల్లగొండ, ఖమ్మం జిల్లాలు విజయకేతనం ఎగురవేశాయి. బాలుర విభాగంలో వరంగల్ జిల్లా (ప్రథమం), నల్లగొండ జిల్లా(ద్వితీయ), ఖమ్మం జిల్లా (తృతీయ), బాలికల విభాగంలో నల్లగొండ జిల్లా(ప్రథమం), వరంగల్ జిల్లా(ద్వితీయ), ఖమ్మం జిల్లా(తృతీయ) స్థానంలో నిలిచాయి. ఇందులో జాతీయ స్థాయికి బాలుర, బాలికల జట్లను ఎంపిక చేశారు. ఈ నెల 28 నుంచి 30వ తేదీ వరకు ఏపీలోని కడపలో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో బాలుర జట్టు పాల్గొంటుంది. అలాగే, ఈ నెల 24 నుంచి 28 వరకు జార్ఖండ్ రాష్ట్రంలో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో బాలిక జట్టు పాల్గొంటుంది.

మార్కెట్ కార్యదర్శిపై విచారణ పెండింగ్

- బిజీతో వాయిదా వేసిన డీడీఎం
- త్వరలో విచారణ తేదీ ప్రకటన

వరంగల్: ఏనుమాముల మార్కెట్ ఉన్నత శ్రేణి కార్యదర్శిగా పనిచేసిన రాహుల్‌పై వచ్చిన ఆరోపణలపై చేపట్టిన విచారణ వాయిదా పడింది. వరంగల్ బాలాజీ నగర్‌కు చెందిన మహేష్.. రాహుల్‌పై పలు ఆరోపణలు చేస్తూ గతేడాది అక్టోబర్ 4వ తేదీన మార్కెటింగ్‌శాఖ అడిషనల్ సెక్రటరీ ఎల్.సరితా రాణికి లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదుపై స్పందించిన అడిషనల్ సెక్రటరీ అదే నెల 5వ తేదీన చర్యలు తీసుకోవాలని మార్కెటింగ్ శాఖ డైరెక్టర్ లక్ష్మీబాయికి ఆదేశాలు జారీ చేశారు. దీంతో ఈ వ్యవహారంపై విచారణ జరిపి నివేదిక అందించాలని మార్కెటింగ్ శాఖ డైరెక్టర్ లక్ష్మీబాయి వరంగల్ ఆర్‌డీడీఎం అజ్మీరా రాజునాయక్‌ను ఆదేశించారు. ఆర్‌డీడీఎం రాజు నాయక్ 2024 జనవరి 19వ తేదీన మార్కెట్ కార్యాలయంలో జరిగే విచారణకు హాజరు కావాలని ఫిర్యాదుదారుడు మహేష్‌తో పాటు మార్కెట్ సెక్రటరీ రాహుల్‌కు గత నెల 28వ తేదీన నోటీసులు జారీ చేశారు. ఫిర్యాదుదారుడు మహేష్ అడ్రస్ పేరు పేర్కొనకపోవడం, అందులో ఒక వ్యాపారి సెల్ నంబర్ ఉండడంతో సదరు వ్యాపారికి నోటీసులు అందజేసినట్లు తెలిసింది.

విచారణ తేదీ ప్రకటిస్తాం

మార్కెట్ కార్యదర్శి రాహుల్‌పై వచ్చిన ఆరోపణల నేపథ్యంలో శాఖ పరంగా విచారణ చేయాలని ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు. జనవరి 19వ తేదీన ఫిర్యాదుదారుడు, కార్యదర్శి విచారణకు హాజరు కావాలని నోటీసులు ఇచ్చాం. మిర్చి ధరలు పడిపోవడంతో మార్కెట్‌లను సందర్శించే బిజీలో ఉన్నాం. దీంతో విచారణ వాయిదా వేశాం. విచారణ తేదీని త్వరలో ప్రకటిస్తాం. **–రాజు నాయక్, ఆర్‌డీడీఎం**

రాహుల్‌పై ఆరోపణలు..

రాహుల్.. వరంగల్ గ్రేయిన్ మార్కెట్‌లోని అడ్తి వ్యాపారులకు ఇచ్చిన గదులకు అద్దెలు పెంచినట్లు నోటీసులు ఇచ్చి అడ్తిదారులతో లోపాయికారీ ఒప్పందం చేసుకుని పెద్ద మొత్తంలో డబ్బులు కమీషన్ రూపంలో తీసుకున్నారని ఆరోపించారు. మార్కెట్‌లో కొంత మంది వ్యాపారులు, అడ్తిదారులు కలసి కాటన్ జీరో వ్యాపారం చేసి డబ్బులు దండుకున్నట్లు ఆరోపించారు. అదే విధంగా ఏనుమాములలో ఉన్న ఎకరం భూమిని చాంబర్‌కు అతి తక్కువ ధర అద్దెకు అప్పజెప్పేందుకు బేరం కుదుర్చుకున్నట్లు ఆరోపించారు. వ్యాపారులతో చేతులు కలిపి ఏనుమాముల మార్కెట్‌లో ఈ-నామ్ అమలు చేయకుండా లోపాయికారీ ఒప్పందం చేసుకుని జీరో పెద్ద ఎత్తున సాగేందుకు సహకారం అందించినట్లు ఆరోపించారు. అడ్తి లైసెన్సుల్లో సైతం పెద్ద ఎత్తున డబ్బులు చేతులు మారాయని, కూరగాయల మార్కెట్‌లో షాపుల కేటాయింపుల్లో చేతి వాటం ప్రదర్శించారని ఆరోపించారు. 'ఏదీ చెప్పినా అన్నింటికి డైరెక్టర్ మేడంతో మాట్లాడాను అనుమతి ఉంది. నాకేం కాదు అంటున్నాడని' ఫిర్యాదులో పేర్కొనడంతో విచారణకు ఆదేశాలు జారీ అయినట్లు తెలిసింది.

మహిళ ఆత్మహత్య

జనగామ రూరల్: కుటుంబ కలహాలతో ఓ మహిళ ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. ఈ ఘటన పట్టణంలోని సెయింట్ మేరీస్ పాఠశాల ఏరియాలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం పట్టణంలోని సెయింట్ మేరీస్ పాఠశాల ఏరియాకు చెందిన కర్రె మల్లేష్ ట్రావెల్స్ నడుపుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. ఈ క్రమంలో మల్లేష్ భార్య అంబిక (28) గతంలో తన పిల్లలకు బంగారం కావాలని తండ్రిని కోరింది. అయితే సంక్రాంతి పండుగకు పుట్టింటికి వెళ్లగా తండ్రి బంగారం విషయం చెప్పలేదు. దీంతో మనస్తాపం చెందిన అంబిక గురువారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. మృతురాలికి ఇద్దరు కూతుళ్లు, ఒక కుమారుడు ఉన్నారు. ఈ ఘటనపై మృతురాలి తండ్రి నర్సింహులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సృజన్ తెలిపారు.

క్రీడలతో మానసిక ఉత్తేజం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు



క్రీడల్లో తలపడుతున్న క్రీడాకారులు

- ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు
- అంబేడ్కర్ స్టేడియంలో కోల్‌ఇండియా హాకీ పోటీలు ప్రారంభం

భూపాలపల్లి అర్బన్: బొగ్గు ఉత్పత్తే లక్ష్యంగా పని చేస్తున్న కార్మికులకు క్రీడలతో మానసిక ఉత్తేజం కలుగుతుందని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు తెలిపారు. భూపాలపల్లి ఏరియాలోని అంబేడ్కర్ స్టేడియంలో గురువారం కోల్ ఇండియా హాకీ పోటీలు ప్రారంభమయ్యాయి. ఏరియా సింగరేణి జనరల్ మేనేజర్ బళ్లారి శ్రీనివాసరావు అధ్యక్షతన ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావుతో పాటు సింగరేణి డైరెక్టర్ ఎస్‌వీకే శ్రీనివాస్ ముఖ్య అతిథులుగా హాజరై పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కార్మికుల్లో మానసిక ఉత్తేజం నింపేందుకు క్రీడలు నిర్వహిస్తున్న సింగరేణి, కోల్ ఇండియా యాజమాన్యాలకు ధన్యవాదాలు తెలిపారు. క్రీడల్లో గెలుపోటములు సహజమని, ఓడిన వారు నిరాశపడకుండా గెలుపు కోసం మరోసారి ప్రయత్నం చేయాలన్నారు. అనంతరం క్రీడాకారులను పరిచయం చేసుకుని దుస్తులు అందజేశారు. ఈ కార్యక్రమంలో అధికారులు, కార్మిక సంఘాల నాయకులు బసవయ్య, రమేష్, వెంకటయ్య, రాజ్‌కుమార్, ధర్మపురి, తుకారాం, కిరణ్‌కుమార్, పాల్గొన్నారు. కాగా, ఈ పోటీల్లో మొదట ఎస్‌సీసీఎల్ (తెలంగాణ) ఎంసీఎల్ (ఒడిశా) జట్లు తలపడగా ఎస్‌సీసీఎల్ జట్టు 2 గోల్ తేడాతో గెలిచింది. అనంతరం డబ్ల్యూసీఎల్(మహారాష్ట్ర, ఎన్‌సీఎల్ (మధ్యప్రదేశ్)జట్లు తలపడగా గోల్ తేడాతో ఎన్‌సీఎల్ జట్టు గెలుపొందింది.

వివాహిత అదృశ్యం



షేక్ మహబూబ్‌బీ

ఐనవోలు: ఓ వివాహిత అదృశ్యమైంది. ఈ ఘటన మండల కేంద్రంలో చోటుచేసుకుంది. ఎస్సై అనిల్‌కుమార్ కథనం ప్రకారం వరంగల్ జిల్లా రాయపర్తి మండలం జగన్నాథపల్లి గ్రామానికి చెందిన షేక్ మహబూబ్ బీ తన తల్లిదండ్రులతో కలిసి ఐనవోలు జాతరలో రింగుల దుకాణం ఏర్పాటు చేయడానికి ఈ 17వ తేదీన ఉదయం ఎనిమిది గంటలకు మండల కేంద్రానికి చేరుకుంది. తర్వాత కనిపించక పోవడంతో ఆమె తల్లిదండ్రులు పలుచోట్ల వెతికారు. అయినా ఆచూకీ లభించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు. షేక్ మహబూబ్ బీ ఆచూకీ తెలిసిన వారు 8712685030, 8712685244 నంబర్లకు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని ఎస్సై తెలిపారు.

దాతలు దయచూపండి..

- తండ్రి కుమారులకు కేన్సర్ వ్యాధి
- చికిత్సకు డబ్బులు లేక తీవ్ర ఇబ్బందులు
- సాయం చేయాలని వేడుకోలు





భార్య, ఇద్దరు కుమారులతో వేణుమాధవ్(ఫైల్)

గీసుకొండ : గ్రేటర్ వరంగల్ నగరం 16వ డివిజన్ ధర్మారానికి చెందిన మాదారపు వేణుమాధవ్, అతడి పెద్ద కుమారుడు ఫణీంద్ర కొంత కాలంగా కేన్సర్ వ్యాధితో బాధపడుతున్నారు. గ్రామంలో కిరాణా షాపు నిర్వహిస్తూ జీవనం సాగిస్తున్న వేణుమాధవ్, సునీత దంపతులకు ఇద్దరు కుమారులు. వేణుమాధవ్‌కు కొంత కాలం క్రితం దవడ కేన్సర్ రాగా పలు ఆస్పత్రుల్లో సుమారు రూ. 20 లక్షల మేర ఖర్చు చేసి చికిత్స చేయించుకుని కోలుకుంటున్నాడు. అతడి పెద్ద కుమారుడు ఫణీంద్ర అనారోగ్యంతో బాధపడుతుండడంతో పరీక్షలు చేయించగా అతడికి బ్లడ్ కేన్సర్ ఉన్నట్లు వైద్యులు నిర్ధారించారు. అతడికి రోజు చికిత్సలు చేయించాలంటే రూ. వేలలో ఖర్చు అవుతుండడంతో వారి కుటుంబం ఆర్థికంగా దీనస్థితికి చేరింది. తమ కుమారుడి చికిత్స కోసం రూ. 50 లక్షల మేర ఖర్చు అవుతుందని వైద్యులు చెబుతున్నారని, అంతటి స్తోమత తమకు లేదని, వైద్యం కోసం సాయం అందించాలని తల్లి సునీత వేడుకుంటోంది.

సాయం చేసే వారు 90146 74308 నంబర్‌కు గూగుల్ లేదా ఫోన్‌పే చేయాలని బాధితులు కోరుతున్నారు.

లైంగిక దాడి కేసులో నిందితుడికి పదేళ్ల జైలు

వాజేడు: లైంగిక దాడి కేసులో నిందితుడికి పదేళ్ల కఠిన కారాగార శిక్షతో పాటు రూ. 18 వేల జరిమానా విధిస్తూ ములుగు జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి లలిత శివ జ్యోతి గురువారం తీర్పు వెలువరించారు. ములుగు కోర్టు లైజెనింగ్ ఆఫీసర్ కమలాకర్ కథనం ప్రకారం వాజేడు మండలం చెరుకూరు గ్రామానికి చెందిన యాలం భూపతిరావు 2021 సంవత్సరంలో యువతిపై లైంగిక దాడికి పాల్పడ్డాడు. ఈ ఘటనలో బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. గురువారం వెంకటాపురం(కె) సీఐ బండారి కుమార్, వాజేడు ఎస్సై వెంకటేశ్వర్ రావు సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టగా అడిషనల్ పీపీ సత్యనారాయణ బాధితుల పక్షాన వాదనలు వినిపించారు. నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి నిందితుడు భూపతిరావుకు 10 ఏళ్ల కారాగార శిక్ష, రూ.18 వేల జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించారు.

వరకట్నం కేసులో మరో వ్యక్తికి మూడేళ్లు..

నర్సింహులపేట: వరకట్న వేధింపుల కేసులో మండలంలోని పడమటిగూడేనికి చెందిన కొండ రమేష్‌కు మూడేళ్ల జైలు శిక్ష విధిస్తూ తొర్రూరు సివిల్ కోర్టు జడ్జి సరిత గురువారం తీర్పు వెలువరించారు. వరకట్న వేధింపుల ఘటనపై 2014లో తేజస్విని తన భర్త రమేష్‌పై పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టిన అనంతరం కోర్టులో హాజరుపర్చగా రమేష్‌కు మూడేళ్ల జైలు శిక్ష విధిస్తూ జడ్జి తీర్పు వెలువరించారని ఎస్సై గండ్రాతి సతీష్ తెలిపారు.